సాక్షి
విజయనగరం
మంగళవారం | 15 | జూలై | 2025



అర్జీలు సకాలంలో పరిష్కరించాలి
ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. -8లో



చిన్నారి విషాదం..!
బొబ్బిలి పట్టణంలోని ఓ హైస్కూల్‌కు చెందిన విద్యార్థుల మధ్య గొడవ ఓ విద్యార్థి మృతికి దారితీసింది. మనస్పర్థలకు ఓ నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది. -8లో



అవార్డు అందుకున్న కలెక్టర్
విజయనగరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ (ఓడీఓపీ) విభాగంలో బొబ్బిలి వీణ మొదటి బహుమతికి ఎంపికైన సంగతి తెలిసిందే. న్యూఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ చేతుల మీదుగా ఓడీఓపీ అవార్డును కలెక్టర్ అంబేడ్కర్ సోమవారం అందుకున్నారు.

న్యూస్‌రీల్

బుచ్చెంపేటలో పోలీస్ పికెట్



బుచ్చెంపేటలో వివాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ అశోక్‌కుమార్, తదితరులు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి బుచ్చెంపేట గ్రామంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు సోమవారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. గ్రామంలో స్థల వివాదానికి సంబంధించి రెండు వర్గాల మధ్య కొట్లాట జరిగిన విషయం తెలిసిందే. దీని దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా పికెట్ నిర్వహించడంతో పాటు పర్యవేక్షణ చేపడుతున్నామని తెలిపారు. వివాదానికి కారణమైన ప్రదేశాన్ని పరిశీలించారు. గ్రామంలో ఎవరైనా అనవసరంగా కవ్వింపు చర్యలు, రెచ్చగొట్టే కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైల్వే పార్కింగ్ ఫీజు పెంపుపై ఆందోళన

- డీఆర్‌ఎంకు వినతినిచ్చిన ప్రయాణికులు



పార్కింగ్ స్థలం వద్ద ఆందోళన చేస్తున్న ఎంఎస్‌టీలు

విజయనగరం టౌన్: విజయనగరం రైల్వేస్టేషన్‌లో వాహనాలు పార్కింగ్ చేసేవారినుంచి ప్రైవేటు పార్కింగ్ వ్యవస్థ నిలువు దోపిడీకి రంగం సిద్ధం చేసింది. నెలకు రూ.300 ఉన్న పార్కింగ్ ఫీజును ఒకేసారి మూడురెట్లు పెంచి రూ.900 చేయడంతో చిరుద్యోగులు, దినసరి కూలీలు భగ్గుమన్నారు. పార్కింగ్ ఫీజుల దోపిడీపై సోమవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. విజయనగరం నుంచి విశాఖపట్టణం వెళ్లేందుకు రైల్వే మంత్లీ సీజన్ టికెట్ (ఎంఎస్‌టీ) రూ.250 ఉంటే, వాహనం పార్కింగ్ ఫీజు రూ.900లకు పెంచడమేమిటంటూ పార్కింగ్ సిబ్బందిని నిలదీశారు. రోజుకు బైక్‌కు రూ.10లు ఉన్న ఫీజును రూ.40కి ఎలా పెంచుతారని నిలదీశారు. దీనిపై డీఆర్‌ఎమ్‌పకు వినతిపత్రం అందజేశారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి ఫీజులు తగ్గించుకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బ్యాటరీ స్కూటీలు దగ్ధం



దగ్ధమైన స్కూటీలు

బొబ్బిలి: పట్టణంలోని సిరిపురపు వీధిలో ఓ వ్యక్తి ఇంటి ముందు ఉంచిన బ్యాటరీ స్కూటీ సోమవారం పేలిపోయింది. దీనిపక్కనే ఉన్న మరో స్కూటీ కూడా మంటల ధాటికి కాలిపోయింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా బ్యాటరీ వాహనం కాలిపోయినట్టు వాహనదారులు చెబుతున్నారు.

పకడ్బందీగా ఏపీపీఎస్సీ పరీక్షలు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న లెక్చరల్ పోస్టుల పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జేసీ ఎస్.సేతుమాధవన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో పలు సూచనలు చేశారు. రాజాంలోని జీఎంఆర్, జొన్నాడ లెండీ, గాజులరేగ వద్ద ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్, చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కాలేజీల్లో పరీక్షల ఏర్పాట్లపై ఆరా తీశారు. సమావేశంలో ఏపీపీఎస్సీ, పోలీస్, రెవెన్యూ, ప్రజా రవాణా, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

95:5 నిష్పత్తిలో బియ్యం సరఫరా

రామభద్రపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 95:5 శాతం నిష్పత్తిలో జిల్లాలో ఉన్న 5,71,288 రేషన్ కార్డుదారులకు ఉచితంగా బియ్యం సరఫరా చేస్తున్నట్టు డీఎస్‌ఓ మధుసూదనరావు తెలిపారు. మండలంలోని పలు రేషన్ దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తకార్డుల కోసం 53,500 దరఖాస్తులు రాగా 37,351 దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించామని, వారికి త్వరలో స్మార్ట్ కార్డులు మంజూరుచేసే అవకాశం ఉందన్నారు.





కాలనీలో మరోచోట రోడ్డు తవ్వకాలు

పేదల కాలనీ మార్గంపై.. కూటమి నేతల దుర్మార్గం

- జగనన్నకాలనీ రోడ్డును జేసీబీతో తవ్వేసిన వైనం
- ఆ రోడ్డు స్థలం తమదే అంటూ బుకాయింపు
- కాలనీ వాసుల రాకపోకలకు అవస్థలు
- గగ్గోలు పెడుతున్న పేదలు
- 2020లో కాలనీ ఏర్పడితే ఇప్పుడు తవ్వేయడంపై ఆందోళన

చీపురుపల్లి:

పేదల కాలనీపై కూటమి నేతలు విషం కక్కారు. నాలుగేళ్ల కిందట వేసిన కాలనీ రోడ్డును జేసీబీతో దుర్మార్గంగా తవ్వేసి తమ అధికార బలాన్ని ప్రదర్శించారు. ప్రశ్నించేవారిపై రెడ్‌బుక్ రాజ్యాంగం ఇంతేనంటూ బెదిరింపులకు దిగుతున్నారు. కూటమి నేతల చేష్టలకు పాపం.. పేదలు బిక్కుబిక్కుమంటున్నారు. కాలనీకి వెళ్లే మార్గాన్ని తవ్వేయడం న్యాయమేనా 'బాబూ' అంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అన్యాయాన్ని అడ్డుకునేవారే లేరా అంటూ గగ్గోలుపెడుతున్నారు.

• ఇదీ పరిస్థితి...

పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా 2020లో గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చీపురుపల్లి మండలం జి.అగ్రహారం సమీపంలో పేదలకోసం రూ.12.47కోట్లు ఖర్చుచేసి పక్కా లేఅవుట్ వేసింది. ప్రభుత్వమే భూమి కొనుగోలు చేసి వేసిన లేఅవుట్‌లో 693 మంది పేదలకు పట్టాలు ఇచ్చింది. ఇళ్లు మంజూరు చేసింది. కాలనీలో చక్కనైన రోడ్లు, అర్చ్, విద్యుదీకరణ, మంచినీటి బోర్లు తదితర సౌకర్యాలు కల్పించింది. కాలనీలో ఇప్పటికే 300 మందికి పైగా ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడు ఆ కాలనీకు వెళ్లే రోడ్డును కూటమి నాయకులు తవ్వించేయడం వారిని ఆవేదనకు గురిచేస్తోంది. అగ్రహారం ప్రాంతానికి చెందిన జనసేన, టీడీపీ నాయకులు ఒక్కటై జగనన్న కాలనీకు వెళ్లే రోడ్డును జేసీబీ యంత్రాలతో తవ్వేశారని, అడ్డుపడితే తమ స్థలం అంటూ బుకాయిస్తున్నారని పేదలు వాపోతున్నారు. పట్టపగలే కాలనీ రోడ్డును రెండు చోట్ల తవ్వించేసినా, పేదలు గగ్గోలు పెడుతున్నా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం కనీసం పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కాలనీ ప్రారంభోత్సవంలో అధికారులు ఏర్పాటు చేసిన శిలాఫలకం



కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిని తవ్వేశారిలా..

ఆ రోడ్డు జగనన్న కాలనీదే...

నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మెట్ట కాలనీ వద్ద 2020లో భూమిని కొనుగోలు చేసింది. వివిధ శాఖల అధికారులు లేఅవుట్ వేశారు. రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారు. పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కాలనీ వాసులు చీపురుపల్లి పట్టణానికి రాకపోకలు సాగించే మార్గాన్ని దురుద్దేశపూర్వకంగానే జేసీబీతో తవ్వించారు. ఇది అన్యాయం. వందలాది మంది పేదలకు రోడ్లు లేకుండా చేయడంపై కాలనీ వాసులతో కలిసి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేస్తాం.
– కొసిరెడ్డి రమణ, జి.అగ్రహారం, చీపురుపల్లి

అధికారులను పంపించి విచారణ జరిపిస్తాం

ఇదే విషయమై తహసీల్దార్ డి.ధర్మరాజు మాట్లాడుతూ ఇంతవరకు రోడ్డు తవ్వేసిన విషయం తన దృష్టికి రాలేదని, తక్షణమే అధికారులను పంపించి విచారణ జరిపిస్తామన్నారు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసేవారు ఎంతటివారైనా కేసులు నమోదుచేస్తామని చెప్పారు.

230 కిలోల గంజాయి సీజ్

- ఇద్దరు నిందితుల అరెస్టు
- పరారీలో మరోముగ్గురు..
- ఒడిశా నుంచి విశాఖకు రెండు కార్లలో గంజాయి అక్రమ రవాణా
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్‌జిందల్



సీజ్‌చేసిన గంజాయితో పాటు నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి

విజయనగరం క్రైమ్:

ఒడిశా రాష్ట్రం పాట్టంగి నుంచి విశాఖకు రెండు కార్లలో తరలిస్తున్న 230 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వకుల్ జిందల్ చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. పెదమానాపురం పోలీసులు, ఈగల్ బృందానికి వచ్చిన కచ్చితమైన సమాచారంతో జిల్లాలోని దత్తిరాజేరు మండలం మానాపురం రైల్వే గేట్ సమీపంలో ఈ నెల 13న వాహన తనిఖీలు చేపట్టారు. రెండు కార్లలో 230 కిలోల గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. పోలీసులను చూసి కార్లు విడిచిపెట్టి ముగ్గురు వ్యక్తులు పారిపోయారు. మిగిలిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కొరాపుట్ జిల్లా పాట్టంగి మండలం పదం పంచాయతీ జంగరాదకి చెందిన ఘాసిరాం హంతల్ (24), కొరాపుట్ జిల్లా సిమిలిగూడ మండలం దబాయిగూడ పంచాయతీ ఝులియగూడకి చెందిన కరన్ ఖిలో (24)లు పట్టుబడ్డారు. సురేష్, అదకాబీయా ఖనిలతి, జున్నేష్ పరారయ్యారు. నిందితుల నుంచి 44 ప్యాకెట్లలో ఉన్న గంజాయితో పాటు రూ.700ల నగదు, మూడు మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. పరారైన మరో ముగ్గురు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నాం. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి, గజపతినగరం సీఐ జీఏవీ రమణ, మానాపురం ఎస్సై ఆర్.జయంతి, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు. కానిస్టేబుల్స్ కె.అప్పన్న, కె.శంకర్, హెచ్‌సీ కె.అప్పలస్వామిలను ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు.

రైతు సమస్యలను ప్రభుత్వమే పరిష్కరించాలి



గజపతినగరం రైతుసేవా కేంద్రంలో రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎఫ్‌సీఐ సీజీఎం రాజగోపాల్

- సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ రాజగోపాల్

గజపతినగరం: విత్తు నుంచి పంట దశ వరకు రైతులకు ఎటువంటి సమస్య ఎదురైనా ప్రభుత్వాలే పరిష్కరించాలని సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ ఎ.రాజగోపాల్ అన్నారు. గజపతినగరం దిగువవీధిలోని రైతు సేవా కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో గోనె సంచులు ఇవ్వకపోవడం, తూకంలో ఇబ్బందులను ఏకరువు పెట్టారు. గజపతినగరం పీఏసీఎస్‌కు 2018–19 నుంచి ఇంతవరకు వరకు క్వింటాకు రూ.31.25పైసలు చొప్పున ప్రభుత్వం నుంచి రావాల్సిన కమీషన్ రూ.2,86,52,552ల ఇచ్చేలా చూడాలని సీఈఓ నారాయణరావు కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ డివిజినల్ మేనేజర్ సునీల్ కుమార్, క్వాలిటీ కంట్రోల్ ఏజీఎం సర్కార్, ప్రొక్యూర్ మెంట్ మేనేజర్ జి.వరుణ్‌దేవి, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ నరేష్‌కుమార్, ఏఓ పి.కిరణ్‌కుమార్, విజయనగరం క్వాలిటీ కంట్రోల్ విభాగం సివిల్ సప్లయ్ అధికారి బి.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఇద్దరు మోసగాళ్లు

- పథకాలు ఇస్తామంటూ బాండ్లు ఇచ్చి సంతకాలు చేసి మాయచేశారు
- సూపర్ సిక్స్ ఏవని అడిగితే తోలు తీస్తామంటున్నారు
- ఏడాది కాలంలో అప్పుగా తెచ్చిన రూ.1.60 లక్షల కోట్లు ఎక్కడకి వెళ్లాయి?
- చంద్రబాబు, పవన్‌లు గ్రామాల్లోకి వెళ్లి మేనిఫెస్టో చదవగలరా?
- పేదలు, రైతుల పరిస్థితి దయనీయం
- హామీ ఇచ్చి ఏమార్చడం చంద్రబాబుకు అలవాటే..
- కూటమి తీరును దుయ్యబట్టిన శాసనమండలి విపక్ష నేత 'బొత్స'



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, పాల్గొన్న నేతలు



హాజరైన నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు

చీపురుపల్లి: మాట మీద నిలబడని వారిని, ఇచ్చిన మాట తప్పిన వారిని, చెప్పిన మాటను మార్చిన వారిని మన గ్రామాల్లో ఏమంటారో చెప్పండి.. మోసగాళ్లు, మాయగాళ్లు అంటారా అనరా.. మరి ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చి, ఇంటింటికీ వెళ్లి హామీలు అమలు చేస్తామని సంతకాలు చేసిన బాండ్లు కూడా ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాది కావొచ్చినా హామీలు అమలు చేయని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను ఏమనాలి.. తీరా పథకాలు ఏవని అడిగితే తోలు తీస్తాం, నాలుక మందం అనే మాటలు మాట్లాడుతున్నారు.. ఈ ఇద్దరు మోసగాళ్లకు ధైర్యం ఉంటే గ్రామాల్లోకి వెళ్లి వారు ఎన్నికల ముందు ఇచ్చిన మేనిఫెస్టో చదవగలిగితే ఎవరి తోలు ఎవరు తీస్తారో ప్రజలే నిర్ణయిస్తారంటూ శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ కూటమి తీరుపై ఫైర్‌అయ్యారు. గరివిడిలోని వి–కన్వెన్షన్ ఆవరణలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బొత్స మాట్లాడుతూ ఎన్నికల ముందు సంపద సృష్టించడం తనకు తెలుసని చెప్పిన చంద్రబాబు ఏడాదిలోనే రూ.1.60 లక్షల కోట్లు అప్పులు ఎందుకు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు తెచ్చిన అప్పుల కోసం మాట్లాడితే రాజద్రోహం కేసులు పెడతారని చెబుతున్నారని, భావితరాల భవిష్యత్తును తాకట్టుపెట్టడం దేశ ద్రోహంకాదా అని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన క్యాబినేట్ సమావేశంలో మంత్రులు అవినీతిపై చంద్రబాబు ఫైర్ అయినట్లు కొన్ని పత్రికల్లో చూశానని, 'యథా రాజా తథా ప్రజా' అనే సామెత గుర్తుకొచ్చిందన్నారు. దోపిడీలో సాక్షాత్తూ చంద్రబాబే నంబర్‌వన్‌గా ఉన్నప్పుడు మంత్రులు మాత్రం ఏం చేస్తారని ఎద్దేవాచేశారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు చెప్పిన మాటలు, అధికారంలోకి వచ్చాక చేస్తున్న పరిపాలన చూస్తుంటే.. చంద్రబాబు అంత అబద్ధాలకోరు రాజకీయ నాయకుడిని దేశంలోనే చూడలేదన్నారు. అబద్ధాల పాలనను ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడం వల్ల ఒక్కో పేద, రైతు కుటుంబాలు ఏ మేరకు నష్టపోయాయో వివరించాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చంద్రబాబు, పవన్‌లతోపాటు స్థానిక టీడీపీ నేతల సంతకాలతో కూడిన బాండ్లను అందజేసి మోసం చేసిన తీరును తెలియజేయాలన్నారు. ఎరువు దొరకక రైతులు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోవడం లేదన్నారు. జగన్‌మోహన్ రెడ్డి గుర్తు చేస్తే తప్ప పొగాకు, మిర్చి, మామిడి రైతులు చంద్రబాబుకు గుర్తుకు రాలేదన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే రైతులకు శాపంలా మారుతోందన్నారు. అందుకే రైతులు ఐరన్‌లెగ్ అంటుంటారని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు బొత్స సందీప్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్లు ఎస్.వి.రమణరాజు, కె.వి.సూర్యనారాయణరాజు, గుర్ల, గరివిడి ఎంపీపీలు పొట్నూరు ప్రమీల, మీసాల కృష్ణవేణి, జెడ్పీటీసీలు వలిరెడ్డి శిరీష, వాకాడ శ్రీనివాసరావు, శీర అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ మండలాధ్యక్షులు మీసాల వరహాలనాయుడు, మీసాల విశ్వేశ్వరరావు, పొట్నూరు సన్యాశినాయుడు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, నాలుగు మండలాల నాయకులు దన్నాన జనార్దనరావు, కరిమజ్జి శ్రీనివాసరావు, పతివాడ రాజారావు, బమ్మిడి కార్తీక్, లెంక శ్రీరాములు, తాడ్డి వేణు, పిఎస్ఆర్‌కె.ప్రసాద్, తోట తిరుపతి రావు, స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నిజం చెప్పకూడదు



సీఎం చంద్రబాబునాయుడుకు నిజం చెప్పకూడదన్న శాపం ఉంది. అందుకనే ఎప్పుడూ ఆయన నిజం చెప్పరు. నిజం చెబితే తల వేయి చెక్కలవుతుందన్న భయం. చంద్రబాబు నైజం మోసమని ప్రజలకు తెలిసినప్పటికీ ఆశతో ప్రజలు ఓట్లు వేశారు. మళ్లీ ఎప్పటిలాగే మోసపోయారు. కూటమి నేతల మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే వైఎస్సార్ సీపీ కార్యకర్తల ప్రధాన కర్తవ్యం. 15వ ఆర్థిక సంఘం నిధులు ఇతర పనులకు మళ్లించడంతో పంచాయతీల్లో కనీసం వీధి లైట్లు కూడా వేయలేని దుస్థితి. సంక్షేమం లేదు. అభివృద్ధి పనులు లేవు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే నాథుడు కూడా లేడు. అంతా మోసపూరిత పాలనే కనిపిస్తోంది.
– బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు

ప్రజలను మోసం చేశారు



చంద్రబాబుపై ప్రజలకు నమ్మకం లేకపోయినా పక్కనే ప్రశ్నించే నాయకుడు ఉన్నాడు.. పథకాలు ఇవ్వకపోతే చంద్రబాబును కడిగేస్తాడని నమ్మి జనం ఓట్లు వేశారు. ఇప్పుడు ఆ పథకాలు లేవు, ప్రశ్నించే గొంతు కనపడకుండా పోయింది. కూటమి ఇచ్చిన హామీలు, మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేద్దాం. ప్రజల గొంతుకై నిలబడదాం. దీనికోసం పార్టీ అండగా నిలబడుతుంది. రైతన్నకు ఎరువు దొరకడం లేదు. సాగు సాయం ఎప్పుడిస్తారో తెలియదు.. పింఛన్‌దారుల పేరు జాబితాలో ఉన్నా చేతికి డబ్బులు అందడం లేదు. పోలీస్ వ్యవస్థను కీలుబొమ్మగా మార్చేసి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తున్నారు. కృష్ణా జిల్లాలో ఓ బీసీ మహిళా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కారును చుట్టుముట్టి దాడి చేయడమే దీనికి నిదర్శనం. దాడికి పాల్పడిన వారిని వదిలిపెట్టి కారులో కూర్చున్న జెడ్పీ చైర్‌పర్సన్ భర్తపై కేసు నమోదు చేయడం దౌర్భాగ్యం.
– మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీచైర్మన్

బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సీఎం చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలు ఎగ్గొట్టారు. నిరుద్యోగులు, మహిళలు, చిన్నారులు, ఆడపిల్లలు ఇలా అన్ని వర్గాలవారిని మోసం చేశారు. సొంత మామకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు ప్రజలను వంచించడం పెద్ద కష్టమేమీ కాదు. ఆయన మోసపూరిత పాలనను ప్రజలకు వివరించాలి.
– కిల్లి వెంకట సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ విజయనగరం పార్లమెంట్ పరిశీలకుడు

క్లుప్తంగా

తోటపల్లి పాత ఆయకట్టుకు నీరు విడుదల రేపు



తోటపల్లి జలాశయం

వీరఘట్టం: తోటపల్లి జలాశయం పరిధిలో ఉన్న పాత ఆయకట్టుకు ఈ ఏడాది ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో నీరందించి పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని ఆయకట్టును సస్యశ్యామలం చేసేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఈనెల 16న బుధవారం తోటపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు జలవనరులశాఖ ఏఈ డీవీ రమణ సోమవారం తెలిపారు. ఈ జలాశయం పరిధిలో ఉన్న చెరువులను తొలుత నింపేందుకు లక్ష్యంగా చేసుకున్నామన్నారు. అనంతరం ప్రణాళికా బద్ధంగా ప్రాజెక్టు పరిధిలో పాత ఆయకట్టు కుడి, ఎడమకాలువ పరిధిలో ఉన్న 64 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి పంపిణీ చేస్తామని చెప్పారు.

రోగులతో ఏరియా ఆసుపత్రి కిటకిట



ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగులు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రి సోమవారం రోగులతో కిటకిటలాడింది. ఒక్కరోజే సోమవారం 442 ఓపీ వచ్చింది. వారిలో 94 మంది జ్వరాలతో బాధపడుతూ రాగా వైద్యులు రక్తపరీక్షలు నిర్వహించారు. మలేరియా ఆర్‌డీటీ కిట్‌లో 18 మందికి పాజిటివ్ రాగా, స్లైడ్ మలేరియా పాజిటివ్ ఒక కేసు వచ్చింది. 49 మందిని ఇన్‌పేషెంట్లుగా జాయిన్ చేసుకుని వారికి వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి సూపరెంటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. మిగతా వారికి తగిన ట్రీట్‌మెంట్ ఇచ్చి మందులు పంపిణీ చేశామన్నారు.

23 నుంచి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

శృంగవరపుకోట: జిల్లా కేంద్రం విజయనగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఈనెల 23, 24, 25 తేదీల్లో జిల్లాస్థాయి చాంపియన్ షిప్, సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు సోమవారం తెలిపారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోషియేషన్ సీఈఓ శ్రీరాములు మాట్లాడుతూ 23న పోటీలు ఉదయం 8గంటలకు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈనెల 20తేదీ లోగా ప్రవేశ రుసుము జి.తేజేశ్వరరావు(9440505275)పార్వతీపురం, కె.అపర్ణబాబా(7981111705)బొబ్బిలి, ఎం.డి.అబ్దుల్(9515729785)సాలూరు, పి.శ్రీరాములు(7989199534)ఎస్‌కోట, కొత్తవలస (9030185690)వై.గణేష్, జి.శ్రీనివాసరావు (9133773485)-విజయనగరం, కె.వేణుగోపాల్(9866933193) చీపురుపల్లిలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏ కేటగిరిలో అయినా ఆరు టీముల కన్నా తక్కువ టీములు హాజరైతే ఆ కేటగిరిలో చాంపియన్‌షిప్ నిర్వహించబోమని విజేతలకు అదే రోజు బహుమతి ప్రదానం చేస్తారని స్పష్టం చేశారు.

అర్జీదారు సంతృప్తి చెందేలా.. వినతుల పరిష్కారం

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులపై అర్జీదారు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించి ప్రజల నుంచి 160 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అందిన వినతులను ఆయాశాఖాధికారులకు సూచిస్తూ, వాటిపై సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్‌ఓ కె.హేమలత, కేఆర్ఆర్‌సీ ఎస్డీసీ డా.పి.ధర్మచంద్రారెడ్డి డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, వివిధ శాఖల అధికారులు, అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

దివ్యాంగులకు ఉపకరణాలను జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక సోమవారం పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో పంపిణీ చేశారు. పాలకొండ మండలం కొండవీధికి చెందిన జమ్మాన తేజశ్రీ, సీతానగరం మండలం వెంకటాపురానికి చెందిన కట్టమూరి కార్తీక్ తమకు ల్యాప్ టాప్‌లు మంజూరు చేయాలని కోరగా, జేసీ వాటిని పంపిణీ చేశారు. అలాగే కొమరాడ మండలం ఆర్తాం గ్రామానికి చెందిన వడ్లమాని ప్రసాదరావుకు చెవిటి మిషనును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకురాలు ఎం.సుధారాణి, విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికార ప్రతినిధి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు వాస్తవాలైతే చట్టపరిధిలో చర్యలు

పార్వతీపురం రూరల్: ప్రతి వారం నిర్వహించే పీజీఆర్‌ఎస్‌లో వచ్చే ఫిర్యాదులు వాస్తవాలైతే తక్షణ చర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందిని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, బాధితులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించు కోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ స్వయంగా ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 13 ఫిర్యాదులు రాగా డీసీఆర్బీ, మహిళా పీఎస్ హెడ్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

చిన్నారి విషాదం..!

- విద్యార్థుల మధ్య ముష్టియుద్ధం
- దెబ్బలు తాళలేక తొమ్మిదో తరగతి విద్యార్థి మృతి



విద్యార్థి మృతదేహం



కార్తీక్(ఫైల్)



మృత దేహం వద్ద రోదిస్తున్న తల్లి విజయ, బంధువులు

బొబ్బిలి: పట్టణంలోని అభ్యుదయ హైస్కూల్‌కు చెందిన విద్యార్థుల మధ్య గొడవ ఓ విద్యార్థి మృతికి దారితీసింది. మనస్పర్థలకు ఓ నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది. నిరుపేద క్షురక కుటుంబానికి చెందిన ఒక్కగానొక్క కుమారుడు ఈ కొట్లాటలో చనిపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల ఆవేదనకు అంతులేకుండా పోయింది. బొబ్బిలిలో సోమవారం జరిగిన ఈ విషాదకర సంఘటన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కాలేజీ రోడ్డులో బార్బర్ షాపు పెట్టుకుని జీవనం వెళ్లదీస్తున్న సుందరాడ సత్యనారాయణ(సంతోష్), విజయ దంపతులకు కార్తీక్(14), కీర్తన ఉన్నారు. కార్తీక్‌ను పట్టణంలోని అభ్యుదయ స్కూల్లో చదివిస్తున్నారు. సీసీటీవీలో కనిపించిన దృశ్యాల ప్రకారం రోజులాగే విద్యార్థి కార్తీక్ స్కూల్ విడిచిపెట్టాక సహ విద్యార్థులతో కలిసి కోట గుమ్మంలోంచి పట్టణంలోని సున్నపు వీధిలోని తన ఇంటికి వస్తున్నాడు. వారితో పాటు వస్తున్న పదో తరగతి చదువుతున్న మండలంలోని గున్నతోటవలసకు చెందిన విద్యార్థి కోటలో గంట కొట్టే ప్రాంతం వద్ద వెనక్కు నడిచి వస్తున్న కార్తీక్ ఒక్కసారిగా పిడిగుద్దులతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అయితే కొద్ది సేపే కొట్లాడుకున్నప్పటికీ దెబ్బలకు తాళలేని కార్తీక్ ఐదారు అడుగులు వేశాక ఒక్కసారిగా నడక బాట పక్కగా ఒరిగిపోయి కుప్పకూలాడు. వెంటనే స్థానికులు కార్తీక్‌ను సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

మృతదేహాన్ని వెనక్కి తెచ్చిన బంధువులు

విద్యార్థి మృతదేహాన్ని వైద్యసిబ్బంది గొడవవుతుందని ఆలోచించి పోస్టుమార్టం రూమ్‌లోకి తీసుకువెళ్లిపోయారు. ఏం జరిగిందో తెలియకుండా పోస్టుమార్టం చేయడానికి వీల్లేదని బంధువులు విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం రూమ్ నుంచి మళ్లీ ఆస్పత్రిలోకి తీసుకువచ్చారు. ఈ లోగా పోలీసులకు, పాఠశాల యాజమాన్యానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించి ఆస్పత్రికి చేరుకున్నారు. కేవలం కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఆస్పత్రి ప్రాంగణమంతా జనాలతో నిండిపోయింది. సీఐ కె.సతీష్ కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి, ఆస్పత్రికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. కుటుంబ సభ్యులు, యాజమాన్యం, తల్లిదండ్రులతో రాత్రి పది గంటల వరకూ చర్చిస్తూనే ఉన్నారు. పోలీసులు వివరాలు వెల్లడించే వరకూ విద్యార్థులు ఎందుకు కొట్లాడుకున్నారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. అయితే క్రికెట్ లేదా బాలిక విషయమై ఇద్దరి మధ్య కొద్ది రోజులుగా మాటల్లేవని, ఈ నేపథ్యంలోనే స్కూల్ నుంచి నడిచి వస్తుండగా భావోద్వేగానికి గురైన వారిద్దరూ ఒక్కసారిగా తీవ్రంగా కొట్లాడుకున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై సీఐ కె.సతీష్ కుమార్ మాట్లాడుతూ సంఘటనపై కేసు నమోదు చేశామని, విద్యార్థుల కేసు జువైనల్ కిందికి వస్తుందని పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

అవయవదానంతో ముగ్గురి జీవితాల్లో వెలుగులు



లోకేష్

అరిలోవ: తాను చనిపోయినా అవయవదానంతో ముగ్గురు వ్యక్తుల జీవితాల్లో వెలుగులు నింపి చిరంజీవిగా మారాడు ఆ యువకుడు. తన కుటుంబానికి తీరని వేదనను మిగిల్చి మరో మూడు కుటుంబాల్లో సంతోషాన్ని నింపాడు. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లా ఎల్.కోట సీతారాంపురానికి చెందిన టి.లోకేష్(36) ఆదివారం సాయంత్రం ఎల్.కోట వద్ద రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర రక్తస్రావంతో విమ్స్‌లో చేరాడు. ఆయన్ని రక్షించేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఆయన ఆరోగ్యం క్షీణించడంతో సోమవారం బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. విమ్స్ డైరెక్టర్, జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు వారి కుటుంబ సభ్యులు, బంధువులకు అవయవదానం గురించి అవగాహన కల్పించారు. వారు అంగీకారం తెలపటంతో ఆయన అవయవాలను స్వీకరించేందుకు అనుమతులను జారీ చేశారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన కిడ్నీలు, లివర్‌ను జీవన్‌దాన్ ప్రొటోకాల్ ప్రకారం సీనియార్టీ లిస్టును అనుసరించి ఆస్పత్రులకు కేటాయించారు. ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపినందుకు గర్వంగా ఉందని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. అవయవదానానికి ప్రోత్సహించిన వైద్య బృందానికి, అంగీకరించిన కుటుంబ సభ్యులకు డాక్టర్ కె.రాంబాబు అభినందనలు పేర్కొన్నారు. విమ్స్‌లో ఇప్పటివరకు ఐదు బ్రెయిన్ డెడ్ కేసుల ద్వారా అవయవాలు సేకరించి పలువురు జీవితాల్లో వెలుగులు నింపినట్లు ఆయన తెలిపారు.

ఖాకీల వేధింపుల నుంచి రక్షణ కావాలి

- ఏఎస్పీ సౌమ్యలతకు బాధితుడి మొర



ఏఎస్పీ సౌమ్యలతకు సమస్య చెప్పుకుంటున్న ఫిర్యాదుదారు కమల్ బాబు

విజయనగరం క్రైమ్: బొబ్బిలి పోలీసుల నుంచి తనను కాపాడాలంటూ విజయనగరం డీపీఓలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఓ ఫిర్యాదుదారు మొర పెట్టుకున్నాడు. నా భార్య ప్రవర్తన బాగోలేదు..నాకు నా కొడుకు భవిష్యత్తే ముఖ్యం..భార్య వద్దు కొడుకును పంపను. కోర్టులో కేసు నడుస్తున్నా..బొబ్బిలి పోలీసులు తనను పిలిచి వేధిస్తున్నారంటూ ఏఎస్పీ సౌమ్యలతకు ఫిర్యాదు చేసి ఓ బాధితుడు వాపోయాడు. పైగా ఏడేళ్లు అవుతున్నప్పటికీ తన భార్య ప్రవర్తన బాగోలేక ఏడేళ్ల కొడుకు భవిష్యత్తు కోసం విడాకులు కోరుకున్నానని బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి సమక్షంలో కోర్టులో కేసు నడుస్తోందని ఫిర్యాదు దారు ఓరుగంటి కమల్ బాబు డాక్యుమెంటల్ ఎవిడెన్స్‌తో తన బాధ, వెళ్లగక్కాడు. తాను బొబ్బిలిలో ఉంటూ ఏసీ రిపేర్ పనులు చేసుకుంటూ కొడుకును చూసుకుంటున్నానని, కానీ విడాకుల కేసు కోర్టులో ఉండగానే తిరిగి తన భార్య వేధిస్తోందని బొబ్బిలి స్టేషన్‌లో కేసు కూడా నడుస్తోందని తనకు న్యాయం చేయాలని ఏఎస్పీకి ఫిర్యాదు చేశాడు. తక్షణమే బొబ్బిలి ఎస్సై రమేష్‌పై చర్యలు తీసుకోవాలని ఏఎస్పీని వేడుకున్నాడు. ఈ మేరకు ఫిర్యాదు దారు సమస్య విన్న ఏఎస్పీ సౌమ్యలత వెంటనే బొబ్బిలి పోలీసులతో మాట్లాడి కేసు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఊరట నిచ్చిన వర్షం



పార్వతీపురంలో కురుస్తున్న వర్షం

పార్వతీపురం రూరల్: రెండు వారాల నుంచి వర్షాలు లేకపోవడంతో ఇప్పటికే ఖరీఫ్ రైతులు వేసిన వరి ఎదలు ఎండిపోయి ఉన్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో సోమవారం రాత్రి కురిసిన వర్షం రైతుల్లో ఆశలు చిగిరించేలా చేసింది. అలాగే ఇప్పటికే వరినారు మళ్లు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో వరి ఉభాలకు కూడా రైతులు సిద్ధం కానున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షం చెరువుల్లో నీరు చేరితే వరి ఉభాలకు మరింత అనుకూలంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జేఎన్‌టీయూ జీవీలో ఎమర్జింగ్ టెక్నాలజీపై సర్టిఫికేషన్ కోర్సు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ)లో 'ఎమర్జింగ్ టెక్నాలజీ' కోర్సుకు సంబంధించి వివరాలను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి సోమవారం ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ టెక్నాలజీ, మెషిన్ లెర్నింగ్, ఐఓటీ, సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రంగాల్లో ప్రాముఖ్యత పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి కోర్సుల ద్వారా సంబంధిత నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు. జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించే ఇలాంటి కోర్సులను భవిష్యత్తులో మరిన్ని యూనివర్సిటీ అందిస్తుందన్నారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్
- పీజీఆర్‌ఎస్‌కు 225 వినతులు



ఇందిరమ్మ కాలనీ మహిళల సమస్యలను వింటున్న జేసీ సేతు మాధవన్



ఫిర్యాదు దారుల సమస్యలను వింటున్న ఎస్పీ, ఏఎస్పీలు

విజయనగరం అర్బన్: ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో అర్జీల పరిష్కారంపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. అధికారులు ప్రతిరోజూ పీజీఆర్‌ఎస్ పోర్టల్‌లో లాగిన్ అయి వారి శాఖలకు సంబంధించిన వినతులను చూడాలని, అలాగే రీ ఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని సూచించారు. కొన్ని శాఖలకు సంబంధించిన వినతులను చూడాలని, అలాగే రీ ఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని చెప్పారు. కొన్ని శాఖలకు సంబంధించిన అర్జీలు సకాలంలో పరిష్కరించకపోవడం, గడువు దాటి ఉండడం, నాణ్యమైన పరిష్కారం చూపకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అందుకు గల కారణాలపై ఆరా తీశారు. అధికారులు అర్జీదారులతో మర్యాదగా మాట్లాడాలని, సవివరంగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని గడువు లోగానే వినతులకు నాణ్యమైన సమాధానాలు పంపాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 225 వినతులు అందాయి. సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్‌తోపాటు డీఆర్‌వో ఎస్.శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్‌లు మురళీ, ప్రమీలా గాంధీ, ఎం.వెంకటేశ్వరరావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఇందిరమ్మ కాలనీకి రోడ్డు, కాలువలు కావాలి

గరివిడి మండలం కొండపాలెం పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో మౌలిక సదుపాయాల కొరత పట్టిపీడిస్తోందని కాలనీ మహిళలు సామూహికంగా పీజీఆర్‌ఎస్‌కు వచ్చి జేసీ సేతుమాధవన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దాదాపు 500 ఇళ్లు ఉన్న ఈ కాలనీలో పక్కారోడ్డుగానీ, డ్రైనేజ్ వ్యవస్థగానీ లేకపోవడం వల్ల నివాసం దుర్భరంగా మారిందని అర్జీద్వారా మొరపెట్టుకున్నారు.

ఎస్పీ పీజీఆర్‌ఎస్‌కు 38 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: పోలీస్ స్టేషన్‌కు చ్చిన సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలని ఎస్పీ వకుల్ జిందల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలతలు పాల్గొని ఫిర్యాదు దారుల సమస్యలను ఆలకించారు. కార్యక్రమంలో మొత్తం 38 మంది ఫిర్యాదులు అందుకున్నారు. వచ్చిన ఫిర్యాదు దారుల ముందే సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో ఎస్పీ, ఏఎస్పీలు నేరుగా మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ ఆర్వీఆర్‌కే చౌదరి, డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹90	₹150	₹160

పోలీసు ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు



పరీక్షలు చేయించుకుంటున్న పోలీసుశాఖ అధికారులు

పార్వతీపురం రూరల్: రాష్ట్ర డీజీపీ ఆదేశాలతో ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి జిల్లాలో పనిచేస్తున్న పోలీసుశాఖ ఉన్నతాధికా రులు, అలాగే సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని (మాస్టర్ హెల్త్‌చెకప్) సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్వతీపురం, పాలకొండ సబ్‌డివిజన్‌ల పరిధిలో ఉన్న స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది, ఏఆర్, మినీస్టీరియల్ సిబ్బంది, హోం గార్డులకు ఈ కార్యక్రమం ద్వారా పలు ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ పరీక్షలు విజయనగరంలో ఉన్న మెడికవర్, శ్రీకాకుళంలో మెడికవర్ ఆస్పత్రుల్లో నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి



సాలూరు: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ మహిళావిభాగం జిల్లా అధ్యక్షురాలు, మాజీ జెడ్పీటీసీ రెడ్డి పద్మావతి విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆమె పట్టణంలో మాట్లాడుతూ, కృష్ణా జిల్లా చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గూండాల దాడిని ఆమె ఖండించారు. జిల్లాకు ప్రథమ పౌరురాలైన ఓ మహిళ పరిస్థితి ఇలా ఉందంటే ,రాష్ట్రంలో మిగిలిన మహిళల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని వాపోయారు. వైఎస్సార్‌సీపీ నేతలపై కక్షపూరితంగా ఈ ప్రభుత్వం దాడులు, దౌర్జన్యాలు, వేధింపులకు పాల్పడుతూ ఏడాదిపాలనను పూర్తిచేసిందని విమర్శించారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని సరైన సమయంలో తగిన బుద్ధి చెప్తారన్నారు.

డ్యూయల్ మేజర్ విధానం అమలు చేయాలి

విజయనగరం గంటస్తంభం: ప్రభుత్వం డిగ్రీ అడ్మిషన్లు త్వరగా ప్రారంభించాలి. డ్యూయల్ మేజర్ విధానం అమలు చేయాలని, సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి.చిన్నబాబు మాట్లాడుతూ..ఇంటర్మీడియట్ రిజల్ట్స్ వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వం డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్స్ ప్రారంభించలేదన్నారు. ఒక వైపు ప్రైవేట్ కాలేజీల్లో అనధికారికంగా అడ్మిషన్లు చేసుకుంటూ క్లాసులు నడుపుతున్నారని, దీనివల్ల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాయిన్ అవుతున్న విద్యార్థులు నష్టపోతారన్నారు. అడ్మిషన్లు ఆలస్యం అవడంతో సెమిస్టర్ పరీక్షలు వెంటవెంటనే పెట్టాల్సి వస్తుందని, దీనివల్ల విద్యార్థులు పరీక్షలపై ఆసక్తి చూపలేరన్నారు. అదే విధంగా ప్రభుత్వం సింగల్ మేజర్ పద్ధతి స్థానంలో డ్యూయల్ మేజర్ పద్ధతి తీసుకువస్తామని చెప్పి మళ్లీ సింగిల్ మేజర్ విధానాన్ని అమలు చేస్తామనడం భావ్యం కాదన్నారు. దీనివల్ల విద్యార్థులు మైనర్ సబ్జెక్టు తీసిన దానిపై పీజీ చేయడానికి అవకాశం ఉండడం లేదని, అంతే కాకుండా కొన్ని సబ్జెక్టులు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిద్ర మేలుకుని డ్యూయల్ మేజర్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం డీఆర్‌వో శ్రీనివాసమూర్తికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఈ సమస్యను వెంటనే పరిష్కరించకుంటే బుధవారం పెద్ద ఎత్తున కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.రాజు పాల్గొన్నారు.